RNI NO : TELTEL/2023/88524

# మెదక్ దినపత్రిక

కోరికలు పరిమితంగా
ఉంటే బాధలూ
తక్కువే ఉంటాయి
– రమణ మహర్షి

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 311
బుధవారం, అక్టోబర్ 28, 2026 , పేజీలు - 4 వెల : 2/-

## కేటీఆర్, హరీశ్ రావు
# భ్రమల్లో ఉన్నారు

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని



**హైదరాబాద్ :** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడు తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచ న లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తం గా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చి నట్లు మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు.

## ఎల్‌నినో ప్రభావంతో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం



**సంగారెడ్డి జిల్లా, అక్టోబరు 27 :** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని తెల ంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ( వ్యాఖ్యానించారు. రైతులు చాలా అనుభవజ్ఞులని.. ఈ కరువుపై దృష్టి పెట్టి రెండో పంటను వేయొద్దని కోరారు. ప్రతిపక్షాలు కూడా ఉన్న వాస్తవాన్ని అన్నదాతలకు చెబితే బాగుంటుందని పేర్కొన్నారు. (మంగళవారం) సంగారెడ్డిలో మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని జడ్పీ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ఈటల రాజేందర్
# పాదయాత్రకు బ్రేక్

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు
- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత
- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల
- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ



**హైదరాబాద్ :**మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు.పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు.

## తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు
# కుట్టు మిషన్లు



**హైదరాబాద్, అక్టోబర్ 27:**
బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ (మంగళ వారం) సచివాల యంలో సమీక్ష సమా వేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు.

## 'సత్యం శివం సుందరం'
### సేవ్ ఓట్ ర్యాలీ వేళ రాహుల్ గాంధీ ఆసక్తికర పోస్ట్




**న్యూ ఢిల్లీ :**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘంతో వివాదం కొనసాగుతున్న వేళ శివుడికి ప్రతీకగా ఉన్న మూడు అడ్డగీతల విభూది, నిలువుగా ఉన్న ఎర్రటి కుంకుమ రేఖతో కూడిన చిత్రాన్ని ఆయన పంచుకున్నారు.

# తెలంగాణకు పెట్టుబడులపై ఫోకస్
## గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ సర్కార్ భారీ ప్లాన్!

**హైదరాబాద్, అక్టోబరు 27 :** రాష్ట్రానికి భారీ పెట్టుబ డులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ -2026ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో భాగం గానే ఈ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేస్తో ంది. ఈ సమ్మిట్‌కు 550కు పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలను అందించారు. అక్టోబరు 29వ తేదీన న్యూఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామి కవేత్తలకు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిం చనున్నారు.తెలంగాణకు భారీ పెట్టుబడులే లక్ష్యంగా



గ్లోబల్ సమ్మిట్‌ను రేవంత్ సర్కార్ నిర్వహించనుంది. ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులకు ఆహ్వానాలను అందిం చనున్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ రోడ్‌షోలు నిర్వహించిన విషయం తెలిసిందే. రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు వందకు పైగా కంపెనీలు, సంస్థలకు ఆహ్వానాలను అందించ నున్నారు. ఫ్యూచర్ సిటీలో 25 సెక్టార్లుగా ప్రధాన సమ్మిట్ వేదికను విభజించారు.ప్లీనరీలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రతినిధుల కోసం రవాణా, వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతల కోసం సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నారు. ఈ ఏర్పాట్లన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు.

## ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు దసరా ఆదాయం
# రూ. 33.63 కోట్లు

**వరంగల్:** దసరా పండుగ పర్వదినం సందర్భం గా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర వేసిన ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు రూ. 33.63 కోట్ల ఆదాయం వచ్చినట్లు వరంగల్ ఆర్ఎం భవాని ప్రసాద్ తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ నిర్వహించిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లు విజయవంతం ఆయినట్లు పేర్కొన్నా రు. అక్టోబరు 9 నుంచి 25వ తేదీ వరకు 17 రో జుల పాటు రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 63.76 లక్షల కిలో మీటర్లు బస్సు సర్వీస్‌లు నడుపగా 61.07 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చి రూ. 33.63 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు సోమవారం వరంగల్ రీజినల్ మేనేజర్ భావాని ప్రసాద్ తెలి పారు. మొత్తం ప్రయాణికుల్లో 39.98 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించు కున్నట్లు పేర్కొన్నారు.నుమకొండ డిపో రూ. 4.25 కోట్లు, జనగామ డిపో రూ. 3.81 కోట్లు, వరంగల్ -1 డిపో రూ.5కోట్లు, వరంగల్ -2 డిపో రూ.5.74 కోట్లు, మహబూబాబాద్‌డిపో రూ.2.20 కోట్లు, నర్సం పేట డిపో రూ.2.74 కోట్లు, పరకాల డిపో రూ. 2.50 కోట్లు, తొర్రూరు డిపో రూ. 3.65 కోట్లు, భూపాలపల్లి డిపో రూ.3.69 కోట్ల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

# గ్రావిటీతో నీళ్లిస్తే
# రాజీనామా చేస్తా:

- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్



**హైదరాబాద్:** తెలంగాణలో తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు.

# రాష్ట్రం పిచ్చోడి చేతిలో
# రాయిలా మారింది

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయి లో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తి పోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయ వద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు."రాష్ట్రం ప్రస్తు తం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండి పడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో



కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు.అయితే కేటీఆర్ ఆరోపణల ను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

# ఇక ట్రిపుల్ ఇంజన్ సర్కార్.
## స్థానిక ఎన్నికలపై చాలా కసరత్తు చేశాం:




**అమరావతి:**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పూర్తిస్థాయిలో కసరత్తు చేసిందని, ఈ ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్ర బాబు అన్నారు. నేడు జరిగిన ఎన్డీఏ మీడియా సమావేశంలో ఆయనమాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటుపై తాను, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి ఎన్నడూ చేయనంత కసర త్తు చేశామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇంతగా శ్రమిం చలేదని, ఎంపీటీసీ స్థాయి వరకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారి ంచామని వివరించారుఈ సందర్భంగా ప్రత్యర్థి పార్టీపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోంది. వాళ్లు సొంత కుటుంబంలోనే సంక్షోభాన్ని సృష్టించుకున్నారు. ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. వారి ఆలోచన ప్యాలెస్ కోసం అయితే, మా ఆలోచన, తపన పేద ప్రజల కోసం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు
## ఎంపికైన చేగుంట విద్యార్థినులు




అభినందించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు

చేగుంట, అక్టోబర్ 27 మెదక్ టుడే న్యూస్

చేగుంట మండల విద్యార్థినులు జాతీయ స్థాయిలో సత్తా చాటనున్నారు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ పోటీల్లో చేగుంట విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 21న చేగుంటలో జరిగిన క్లస్టర్ స్థాయి అండర్-19 బాలికల రగ్బీ పోటీల్లో పి. రాశి, ఎన్. రక్షిత, సి.హెచ్. శ్రీజ తదితర విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అనంతరం ఈ నెల 23న హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి 70వ ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ పోటీల్లో ఉత్తర తెలంగాణ జిల్లా తరపున పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. దీంతో ఈ నెల 31న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు వీరు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమణి, ఉపాధ్యాయులు శ్రీధర్, నీలేష్ తరగతి ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

# చేగుంట బస్ స్టాండ్ లో మౌలిక సమస్యలు
## ఉప సర్పంచ్ వినతితో స్పందించిన డిపో మేనేజర్



మరమ్మతులు ప్రారంభం, ప్రయాణికులకు ఊరట

చేగుంట, అక్టోబర్ 27 మెదక్ టుడే న్యూస్

చేగుంట బస్ స్టాండ్ లో మౌలిక వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. బస్ స్టాండ్ లోని మరుగుదొడ్లు, కార్గో రూమ్ లో విద్యుత్ సరఫరా లేకపోవడం, చిన్న చిన్న మరమ్మతులు పెండింగ్ లో ఉండటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని చేగుంట ఉప సర్పంచ్ రఫీ తెలుసుకొని వెంటనే స్పందించారు. తూప్రాన్ డిపో మేనేజర్ పరమేశ్వరిని కలిసి సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ రఫీ వినతికి డిపో మేనేజర్ పరమేశ్వరి సానుకూలంగా స్పందించారు. వెంటనే బస్ స్టాండ్ లో మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఉప సర్పంచ్ రఫీతో పాటు వార్డు సభ్యుడు వంశీ, శీను, కట్ట శీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించిన డిపో మేనేజర్ కు, చొరవ చూపిన ఉప సర్పంచ్ రఫీకి ప్రయాణికులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# గుడిసెలు లేని మెదక్ నిర్మాణమే లక్ష్యం

ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే సంకల్పం: ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

మెదక్,అక్టోబర్,27,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

నియోజకవర్గంలో గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసి, గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు.ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, అది కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భరోసా కల్పించే పునాది అని పేర్కొన్నారు.గుడిసెలు లేని మెదక్‌ను నిర్మించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించి



నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తూ, అభివృద్ధి చెందిన మెదక్ నిర్మాణానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# నిజాంపేట పోలీస్ స్టేషన్‌ను
## అకాస్మికంగా తనిఖీ

జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్,అక్టోబర్,27,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

మంగళవారం జిల్లా ఎస్ పి నిజాంపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ రికార్డులు,పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని, సీసీటీఎన్ఎస్,ఈ-సాక్ష్య అప్లికేషన్లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో 'పోలీస్ అక్క'కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని,అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ తనిఖీలో సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు



పనితీరు మార్చుకోకపోతే రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిక







మెదక్,అక్టోబర్,27,(మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)

భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు తమ పనితీరును మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించా రు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టి, రైతులకు భూమి విస్తీర్ణం, సరిహద్దు లపై స్పష్ట ఇవ్వాలని అధికారులను ఆదేశిం చారు .క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలిస్తూ, రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని స్పష్టం చేశారు.వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీసర్వేను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతోందని పేర్కొన్నారు.పేదల సొంతింటి కల సాకారం చేస్తాం రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాల ని,ఇళ్ల కేటాయింపులు పారదర్శకంగా,అర్హత ప్రాతిపదికన జరగాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎంపీలు రఘు నందన్ రావు, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మూడు జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది
## ఆ తర్వాత కేసీఆర్ వస్తరు కేటీఆర్



మీ నిర్మల్ తాలూకాలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నరు, బీజేపీ ఎంపీ ఉన్నరు.. నిర్మల్‌కు బీజేపీ ఏం చేసిందో ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.. తప్ప వాళ్లు చేసిందేమీ కాదు.. మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా, గోడం నగేశ్ ఎంపీగా గెలిచారు.. ఏమొచ్చింది నిర్మల్‌కు.. అదే కేసీఆర్ ఉన్నప్పుడు నిర్మల్‌కు ఏమొచ్చిందని అడగొచ్చు.. నిర్మల్‌ను జిల్లా చేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ పెట్టిందెవరు.. నర్సింగ్ కాలేజీ పెట్టిందెవరు.. నిర్మల్‌లో అభివృద్ధికి బాటలు వేసిందెవరు.. కేసీఆర్.. నిర్మల్ పట్టణంలోకానీ, తాలూకాలో కానీ నేను స్వయంగా వచ్చి మీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించిన. నేనొచ్చి మిషన్ భగీరథ ద్వారా మీ ఇంటింటికి తాగునీళ్లిచ్చే కార్యక్రమం మొదలుపెట్టిన. బ్రహ్మాండంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం.. అయిల్ ఫామ్‌లు పెట్టుకున్నమన్నారు.

నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడి పారిపోయాడు. అవకాశవాదులు పార్టీని వీడినా, పోరాట యోధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు.ఎప్పుడైనా ప్రతీ పార్టీలో రెండు రకాల వ్యక్తులుంటారు.. ఒకటి అవకాశవాదులుంటారు.. రెండోది పోరాట వాదులుంటారు.. ఆయన అవకాశవాదంతో బయటకు పోయినా మేమున్నం అన్నా భయపడకండని పోరాడుతున్న మీ అందరికీ తల వంచి నమస్కారం చేస్తున్నా.. మంచి రోజులు ముందున్నయి. ఇంకో సంవత్సరమే వీళ్ల కథ.. మూడేళ్లయిపోయింది.. సినిమా ఇంటర్వెల్ కూడా పూర్తయిపోయింది. సెకండాఫ్ కూడా చాలా అయింది.. ఇంకా ఎక్కువ టైం కూడా లేదు.. ఇంకో సంవత్సరం మాత్రమే ఉంది.. ఆ తర్వాత కేసీఆర్ వస్తరు.. మనం దరికీ మంచి రోజులొస్తయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

మాజీ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భూపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గారి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 27,
(మెదక్ టుడే న్యూస్ ),

పెద్ద శంకరంపేట మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని కోళ్లపల్లి, గొట్టిముక్కల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు.నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు గారి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం



జరిగింది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి హరీష్ రావు గారు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.కోళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అన్న అయిన శ్రీ హట్కారి గణేష్ రావు పటేల్ గారు, మాజీ పార్టీ అధ్యక్షుడు చాకలి నరేష్ గారు, గొట్టిముక్కల గ్రామానికి చెందిన తోట యాదగిరి గారు, పెరుమాండ్ల నర్సింలు గారితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి గారి నాయకత్వంపై విశ్వాసంతో, పార్టీ సిద్ధాంతాలు మరియు ప్రజల పక్షాన నిలిచే పోరాటాలకు ఆకర్షితులై పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరడం సంతోషకరమని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ గారు, మాజీ రైతుబంధు అధ్యక్షుడు సురేష్ గౌడ్ గారు, మాజీ ఎంపీటీసీ దత్తు గారు, మాజీ ఎంపీటీసీ దామోదర్ గారు, చంద్రకాంత్ గారు, సంగమేశ్వర్ గారు, ఆగమయ్య గారు, ప్రభాకర్ గారు, రాజు గారితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య

ఉపగ్రహ చిత్రాలతో భూ పటాలు.. పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తాం

తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సంగారెడ్డి,అక్టోబర్,27, (మెదక్ టుడే న్యూస్:

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తామని పేర్కొన్నారు.మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్





జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంపులు--రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డుల్లో స్పష్టత తీసుకొచ్చి భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.గతంలో ధరణి విధానంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ, భూ యజమానుల హక్కులకు రక్షణ కల్పించడమే భూభారతి చట్టం ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా భూ పరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

**15 రోజుల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు**

గతంలో అసంపూర్తిగా మిగిలిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, అర్హులకు కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 90 శాతం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలకు ఇళ్లు అందిస్తామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

**ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై సమస్యలు ఎదురవుతున్నాయని, భవిష్యత్తులో ఇతర ప్రాజెక్టుల్లోనూ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రెండో పంట సాగుకు నీటి లభ్యత సమస్యగా మారే పరిస్థితులు ఉన్నందున రైతులు పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నీటి వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.నీటి కొరతపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ అంశాలపై చర్చించేందుకు బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాల పరి రక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం
## తెచ్చిన కరువే కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణలో వచ్చింది ప్రకృతి కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్మల్ జిల్లాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కేటీఆర్ సమక్షంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కరువు పరిస్థితులకు రేవంత్ రెడ్డిదే బాధ్యత అన్నారు.గోదావరి, కృష్ణా నదుల్లో నీళ్లు పారుతున్నా.. తెలంగాణ పొలాలు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే.. అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోయకుండా వృథాగా సముద్రంలోకి వదిలేశారని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లు ఆన్ చేసి ఉంటే రైతులకు సాగునీరు అందేది. రేవంత్ రెడ్డి ఆ పని చేయలేదన్నారు. కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయకపోవడం వల్లే గోదావరి జలాలను వినియోగించుకోలేకపోయాం.

# పాలమూరు వర్సెస్ నల్గొండ - దిండి నీళ్లపై జిల్లాల మధ్య చిచ్చు!

**హైదరాబాద్ :** దిండి ఎత్తిపోతల పథకం నీళ్లివ్వక ముందే నిప్పులు రాజేస్తోంది. ఏదుల జలాశయం నుంచే దిండికి నీళ్లు తీసుకోవాలని పాలమూరు-రంగారెడ్డికి ఇబ్బంది లేకుండా 0.6 టీఎంసీలు అదనంగా తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని నల్గొండ నేతలు హర్షిస్తున్నప్పటికీ పాలమూరు నేతల మధ్య రాజకీయ మంట పుట్టిస్తోంది. సమస్యకు మూల కారణం బీఆర్ఎస్సేనని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, దిండి ప్రాజెక్టు రద్దు కోసం బీజేపీ జేఏసీని ఏర్పాటు చేసింది. మరోవైపు పాలమూరుకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని బీఆర్?ఎస్ సైతం హెచ్చరిస్తోంది.ఏదుల నుంచే దిండికి నీళ్లు తీసుకోవానల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు నీరందించేందుకు దిండి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. ఎస్?ఎల్?బీసీ నుంచి దిండికి నీళ్లందించాలని తొలుత భావించినప్పటికీ సొరంగం పనుల్లో జాప్యం, ఇతర కారణాలతో అది అటకెక్కింది. అనంతరం బీఆర్?ఎస్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి నీళ్లు తీసుకోవాలని భావించారు. అందుకు అనుగుణంగా ఉల్పర, సింగరాజుపల్లి, గొట్టిముక్కుల, శివన్నగూడెం వంటి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టారు. అయితే నార్లపూర్ లేదా ఏదుల రిజర్వాయర్లలో ఎక్కడి నుంచి తీసుకోవాలనే అంశంపై మాత్రం నిర్ణయానికి రాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏదుల నుంచి నీళ్లు తీసుకోవాలని నిర్ణయించడంతో తాజాగా వివాదం రాజుకుంది.దిండి ఎత్తిపోతలలో వివాదానికి కేసీఆర్ సర్కారే కారణమని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అధికారంలో ఉన్న పదేళ్లలో ఎస్?ఎల్?బీసీ పూర్తి చేసుంటే సమస్య ఉండేది కాదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



పేర్కొన్నారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున చేపట్టిన పాలమూరు-రంగారెడ్డిలో అర టీఎంసీ దిండికి కేటాయిస్తూ వివాదానికి ఆజ్యం పోశారని మండిపడ్డారు.దిండి ప్రాజెక్టుపై రాజకీయాలు (జుఎ)ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు అన్యాయం చేయాలనుకోవడం బాధాకరం. పాలమూరు బిడ్డగా మూడేళ్లలో రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. భేషజాలకు పోకుండా రైతులకు మేలు చేయాలి. దీపావళి తర్వాత దిండి ప్రాజెక్టు రద్దు జేఏసీ ఆధ్వర్యంలో కార్యాచరణతో పాటు పాలమూరు ప్రాజెక్టుల సందర్శన చేపడతాం. - డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీబీఆర్?ఎస్?ను బూచిగా చూపి దిండి లిఫ్టును ముందుకు తీసుకెళ్లడం సరికాదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. పాలమూరు రైతుల ఆకాంక్షకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరించవద్దని కోరారు. దిండికి కావాలంటే నాగార్జున సాగర్ నుంచైనా నీరు తీసుకోవాలని సూచించారు. దిండి ప్రాజెక్టు భవిత్వం అటుంచితే, పార్టీల మధ్య మాత్రం మాటల తూటాలు పేలుతున్నాయి. ఇటు ఎలనినో, అటు నీళ్ల సెంటిమెంట్‌తో ఏ పార్టీ వెనకడుగు వేయడం లేదు. విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయాన్ని మరింత రచ్చకెక్కిస్తున్నాయి.

## 'రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి'




**రామగిరి, అక్టోబర్ 27 :** రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గౌరవ వేతనం, కమీషన్ పెంపుతో పాటు రేషన్ షాపులకు ఉచితంగా సరుకుల రవాణా, తూకంలో బియ్యం సరఫరా తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీలర్లు నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300 కమీషన్ చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఫుడ్ సెక్యూరిటీ చట్టం ప్రకారం రేషన్ దుకాణాల వద్దకే సరుకులను ఉచితంగా రవాణా చేసి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని కోరారు. గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా చేసే బియ్యాన్ని ఖచ్చితమైన తూకంతో అందించాలని డిమాండ్ చేశారు. గత 20 నెలలుగా దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాల్లోనే ఉండిపోవడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో క్వింటాల్ బియ్యంపై 10 శాతం తరుగు సడలింపు కల్పించాలని కోరారు.

## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ ఆస్ట్రేలియా బృందం



**హైదరాబాద్ :**బీఆర్ఎస్ ఆస్ట్రేలియా బృందం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా బృందం సభ్యుడు వంశీ సాధు కుటుంబంలో జరగనున్న వివాహ వేడుకకు హాజరు కావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఆస్ట్రేలియాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, తెలంగాణ సమాజ అభ్యున్నతికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా చేస్తున్న కృషిని కేటీఆర్ అభినందించారు. విదేశాల్లో ఉంటూ పార్టీ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రశంసించారు.తమ నాయకుడు కేటీఆర్ ఆస్ట్రేలియా బీఆర్ఎస్ బృందం చేస్తున్న సేవలను అభినందించడం ఎంతో సంతోషంగా, ప్రోత్సాహకరంగా ఉందని బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులోనూ పార్టీ అభివృద్ధికి, తెలంగాణ సమాజ సేవకు మరింత అంకితభావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. కేటీఆర్‌ను వంశీ సాధు , దీక్షిత ,తమ కుటుంబ సభ్యులతో కలిశారు.

## తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా: బాల్క సుమన్

**హైదరాబాద్** ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు నెలకొందన్న బాల్క సుమన్ నీళ్లు, కరెంట్ లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన సమస్యలు పరిష్కరించకుండా హరీశ్, కేటీఆర్‌లపై విమర్శలెందుకని ప్రశ్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, ప్రభుత్వమే సృష్టించిన కరవు అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రైతులు నీళ్లు, కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం తుమ్మిడిహెట్టి పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని సుమన్ మండిపడ్డారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వంతో రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన చర్చలను ఓ పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ఉన్న నీటిని ముందుగానే వదిలేసి, ఇప్పుడు బ్యారేజీ నిర్మిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు.పాలమూరు-రంగారెడ్డి




లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి హరీశ్ రావు పూర్తి వివరాలతో నిన్ననే వివరించారని గుర్తు చేశారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు.పాలమూరు-రంగారెడ్డి లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం గతంలోనే స్పష్టం చేసినప్పుడు, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుల సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు.పాలమూరు-రంగారెడ్డి లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, ఎంత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది, అయ్యే ఖర్చు వివరాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్, కె. కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బడులు పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోదు.. రేవంత్ సర్కార్‌పై ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు

**ఖమ్మం జిల్లా :** ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల చిన్నారి ధనశ్రీ మృతి ఘటనపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు సరైన వసతులు, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. పిల్లల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నిబద్ధత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.ఖమ్మం జిల్లా కేవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విషకీటకం కుట్టడంతో ఐదేళ్ల ధనశ్రీ మృతి చెందిన ఘటనపై మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సారీ తల్లీ ధనశ్రీ.. నిన్ను ఈ ప్రపంచానికి దూరం చేసుకున్నాం. అన్ని బడుల్లో మంచి వసతులతో కూడిన ప్రీప్రైమరీ తరగతులు, గదులు ఉండి ఉంటే నువ్వు ఈ రోజు బతికి ఉండేదానివి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.పిల్లల విద్య, భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు కావాలని ఆకునూరి మురళి సూచించారు. కనీస సౌకర్యాలు లేని ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి



చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యా బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణమే ఐదేళ్ల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు.మరోవైపు, అంగన్‌వాడీ టీచర్ స్థానికంగా ఉండకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి టేకులపల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ నిరసనకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

## హైదరాబాద్‌లో ఆపరేషన్ 'కవచ్'.. పోలీసుల విస్తృత తనిఖీలు

**హైదరాబాద్:**




భాగ్యనగరంలో ఆపరేషన్ 'కవచ్' ఉత్కంఠ రేపుతోంది. పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నగరంలో భారీ భద్రతా ఆపరేషన్‌ను చేపట్టారు. హైదరాబాద్ వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజల భద్రతే ధ్యేయంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ కవచ్ కొనసాగుతోంది. నగరంలోని ప్రతి ప్రధాన కూడలి వద్ద పోలీసు సిబ్బంది భారీగా మోహరించారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న వ్యక్తులను, వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.పత్రాలు లేని, సరికాని నంబర్ ప్లేట్లు ఉన్న వందలాది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజులుగా నగరంలో చోటుచేసుకున్న వరుస హత్యలు, నేరాల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. నేరాల కట్టడి, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆపరేషన్ కవచ్ చేపట్టారు. ప్రజల భద్రత కోసమే ప్రత్యేకంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## హెలికాప్టర్ మంత్రులకు నీళ్ల సోయి లేదు



**దేవరకొండ, అక్టోబర్ 27 :** రాష్ట్రంలో వచ్చిన కరువు ఎల్ నినో వల్ల కాదని, అది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నీళ్ల సోయి లేక కరెంట్ ఇయ్యలేని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని స్కామ్ ల తోనే రాష్ట్ర పాలన సాగుతుందన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయి శివ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కన్నెపల్లి పుంపు హౌస్ నుండి నీళ్లు తెచ్చే సోయి లేదు. డిండి ప్రాజెక్టు కింద రైతుల పంటలు ఎండిపోతుంటే ఇక్కడ ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలకు పట్టింపు లేదు. కేసీఆర్ ఇచ్చిన 24 గంటల కరెంట్ ఇపుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇస్తలేదో సమాధానం చెప్పాలి. కనీసం నీళ్లు ఎక్కడ నుండి తేవాలో కూడా తెలియని దద్దమ్మలు ఉన్నారని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అన్ని స్కామ్ లే తప్పా స్కీమ్ లు లేవన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్‌ను కోరుకుంటున్నారన్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం అయితే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. అర్హత ఉండి నమోదు కానీ వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్, రాకేష్ రెడ్డి, చింతల వెంకటేశులు, బిల్యానాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్, వెంకట్ రెడ్డి, వల్లపు రెడ్డి, టీవీఎన్ రెడ్డి, ఆంజనేయులు, లోక్య నాయక్, శంకర్ నాయక్, సర్వయ్య, రవి, రాజు, కృష్ణ, రమేష్, చిరంజీవి, వెంకటేశ్వర్ రావు, దస్రూ నాయక్, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోపాల్ గౌడ్ ఉన్నారు.

## తెలంగాణపై అర్నబ్ తుపాను ప్రభావం - ఆ 4 ఉమ్మడి జిల్లాల్లో అతి భారీ వర్షాలు

**హైదరాబాద్:**బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను తెలంగాణలో మంగళవారం నుంచి ప్రభావం చూపే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. 28వ తేదీన తీరం దాటే అవకాశాలసూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించిన వాతావరణ శాఖ, గురువారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమురం భీం



ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 28వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్-యానాం ప్రాంతాల్లో తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. అనంతరం ఉత్తర దిశగా ఈ తుపాను ప్రయాణిస్తుందని నిపుణులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు." బంగాళాఖాతంలో అతి తీవ్ర తుఫాన్ అర్నాబ్ కొనసాగుతుంది. ప్రస్తుతం అదే ప్రాంతంలో గంటకు 20 కిలో మీటర్ల వేగంతో కదులుతుంది. పశ్చివ ు వాయివ్య దిశగా కదులుతుంది. ప్రస్తుతం ఏపీలోని విశాఖపట్నంకి దక్షిణ ఆగ్నేయ దిశల్లో 220 కి.మీ., కాకినాడకి తూర్పు ఆగ్నేయ దిశల్లో 220 కి.మీ. దూరంలో కొనసాగుతుంది. ఈ అతి తీవ్ర తుఫాన్ అర్నాబ్ రేపు ఉదయం బాపట్ల విశాఖపట్నం మధ్య యానాం దగ్గర తీరందాటే అవకాశం ఉంది. తీవ్ర తుఫాన్ ప్రభావంతో రేపు తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి" - అర్నబ్ తుపాను తీరం దాటనుండడంతో భారీ గాలుల ముప్పుతో కుండపోత వర్షం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికే ఎల్?నినో విలయతాండవంతో అన్ని రిజర్వాయర్లలో నీటి మట్టాలు డెడ్? స్టోరేజీకి చేరుతున్నాయి. ఈ సమయానికి 400కు పైగా టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో కేవలం 200 టీఎంసీలే ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ప్రకటించారు. ఈ తుపానుతో ప్రయోజనం ఉంటుందా? అని రైతాంగం ఎదురుచూస్తోంది.

# కుమార్ ప్రాథమిక చికిత్స కేంద్రం' ముసుగులో అక్రమ దందా

- అనుమతుల్లేకుండానే అడ్డగోలు వైద్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం!
- ప్రధాన రహదారిపై బోర్డులు పెట్టి దర్జాగా సెలైన్లు, సూదిమందుల వ్యాపారం
- వైద్యారోగ్య శాఖ అధికారుల కొమ్ముకాపు వల్లేనా? చర్యలకు స్థానికుల డిమాండ్

**అమీన్‌పూర్, అక్టోబర్ 27: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని అనుమతుల్లేని ప్రైవేటు చికిత్స కేంద్రాల దందా మితిమీరిపోతోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ, ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమీన్‌పూర్ చెరువుకట్ట నుంచి లాలాబాయి కాలనీ వెళ్లే ప్రధాన రహదారిపై 'కుమార్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ అండ్ మెడికల్ స్టోర్' పేరుతో దర్జాగా బోర్డు ఏర్పాటు చేసి అక్రమ వైద్య వ్యాపారం కొనసాగిస్తున్నారు.

**పేరుకు ప్రాథమిక చికిత్స.. చేసేది ప్రాణాంతక వైద్యం!**

కేవలం చిన్నపాటి గాయాలకు ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాల్సిన కేంద్రం





ముసుగులో అర్హతలకు మించిన ప్రమాదకర వైద్యం చేస్తున్నారు. ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా రోగులకు గ్లూకోజ్ (సెలైన్) బాటిళ్లు ఎక్కిస్తున్నారు.రోగుల పరిస్థితిని ఏమాత్రం పట్టించుకోకుం డా విచ్చలవిడిగా తీవ్రమైన సూదిమందులు (ఇంజెక్షన్లు), టానిక్‌లు ఇస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారు.బోర్డుపై బహిరంగంగా 'మందుల దుకాణం' (మెడికల్ స్టోర్), 'ఇంటి వద్దకే వైద్య సేవలు' (హోమ్ విజిట్) అంటూ రాసుకోవడమే కాకుండా,



ఇళ్ల వద్దకు వెళ్లి కూడా సెలైన్లు, సూది మందులు వేసే దందా సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఔషధ విక్రేత (ఫార్మసిస్ట్) లైసెన్స్ లేకుండానే మందులు విక్రయిస్తూ అమాయక ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ లోపమా? మామూళ్ల మత్తా?**

ప్రధాన రహదారి పక్కనే ఇంత బహిరంగంగా బోర్డులు పెట్టి అక్రమ దందా నడుపుతున్నా, జిల్లా వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అండదండలు, నెలవారీ ముడుపుల వల్లే వీరు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నా పట్టించుకోరా అని ప్రజలు మండిపడుతున్నారు.



**తక్షణమే మూసివేయాలి: స్థానికుల డిమాండ్**

అమీన్‌పూర్ ప్రధాన రహదారిలోని 'కుమార్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్' పై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్థానిక కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ఈ కేంద్రాన్ని వెంటనే మూసివేసి (సీజ్ చేసి), నిర్వాహకులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని గట్టిగా కోరుతున్నారు.

# పిల్లల్లో ప్లేట్‌లెట్స్ ఎందుకు తగ్గుతాయి

## ఈ లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు



కొంతమంది పిల్లలకు ఏదైనా ఆరోగ్య పరీక్ష చేసినప్పుడు రక్తంలో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయని బయటపడుతుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ వస్తారు. ఇది ప్రమాదకరమైన సమస్య కాదు. సకాలంలో చికిత్స చేస్తే ఇది మందులకు లొంగే జబ్బే. సాధారణంగా రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్స్‌లెట్స్ ఉంటాయి. ప్లేట్‌లెట్స్ రక్తస్రావాన్ని నివారించి ప్రాణులను కాపాడతాయి. ఆ ప్లేట్‌లెట్స్ తగ్గితే రక్తస్రావం జరుగుతుంది.

ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెప్పగానే చాలామంది భయపడతారు. అంత ఆందోళన అవసరం లేదు. మానవ రక్తంలో ప్రతి మైక్రో లీటర్‌లో లక్ష నుంచి అయిదు లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య తగ్గితే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చర్మం నుంచి రక్తం కారుతుంది. పళ్లు తోముకునేప్పుడు రక్తం కారుతుంది. మూత్రంలో రక్తం పడుతుంది. వాంతుల అయినప్పుడు రక్తం పడొచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్యులకు చూపించాలి. ఈ లక్షణాలు లేకపోయినా ఏదైనా రోగ నిర్ధారణ కోసం రక్త పరీక్ష చేసినప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గినట్టుగా గుర్తించినా వైద్య చికిత్స చేయించాలి.

ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడు ఆ రోగిలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాల సంఖ్య ఎంత? రక్తోనత ఉన్నదా? ఇన్‌ఫెక్షన్ ఉన్నదా? ఎక్కడెక్కడ రక్తస్రావం జరుగుతున్నది? రక్తస్రావం ఎలా ఉంది? అనేవి నిర్ధారించుకున్నాక చికిత్స అందిస్తారు. వైరల్ ఇన్‌ఫెక్షన్ వచ్చినప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గడం సాధారణమే. ఆ సమయంలో తెల్ల రక్త కణా ం కూడా తగ్గొచ్చు. ఇమ్యూనిటీ కారణంగానూ ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. దీనిని ఇమ్యూన్ థ్రాంబోసైటో పీనియా అంటారు. కొంతమ ందిలో ఏ కాం ణం లేకుండా ప్లేట్‌లెట్స్ తగ్గొచ్చు. కొంత మందిలో హెపటైటిస్, హెచ్ ఐవీ, క్యాన్సర్ వంటి వ్యాధుల వల్ల వ్యాధి నిరోధకత తగ్గొచ్చు.ఇమ్యూన్ థ్రాంబోసైటోపీనియా ఉన్న పిల్లలు బాగానే ఉంటారు. ప్లేట్‌లెట్స్ కౌంట్ పది వేలకు తక్కువస్థాయికి పడిపోతే రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. వాళ్లకు హాస్పిటల్‌లో చికిత్స చేయాల్సిన అవసరం ఉంటుంది. ఈ జబ్బుకు కారణాలను కొన్ని లక్షణాలు చూసి నిర్ణయానికి రాలేము. కొన్ని లక్షణాల ఆధా రంగా నిర్ధారణకు రాకుండా అనేక లక్షణా లను పరిశీలించాలి. ఆరు నెలలలోపు పిల్లల్లో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉంటే వ్యాధి నిరోధకత వల్ల తగ్గాయా? లేక ఏదైనా జన్యు సమస్య ఉన్నదా తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వ హిస్తాం.

ఈ వ్యాధి బాధితులకు చికిత్స కోసం కాలేయం, ఎముక మజ్జనూ పరీక్షించాల్సిన అవసరం రావొచ్చు. ప్లేట్‌లెట్స్ తగ్గగానే ఆందోళన చెందకుండా వైద్యుల సలహాలతో సకాలంలో చికిత్స చేయిస్తే ఈ సమస్యను తేలిగ్గా అధిగమించవచ్చు.

# మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు.

## లక్షణాలను ముందే గుర్తిస్తే చికిత్స సులభం..

, రొమ్ము క్యాన్సర్ చికిత్స, మానసిక ఒత్తిడి వంటి సవాళ్లను ఎదుర్కొవడం చాలా కష్టం. అయితే వ్యాధి ముదిరిన దశలో గుర్తించినప్పుడు చికిత్స మరింత క్లిష్టంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా, భారత్‌లోనూ మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ ప్రధానమైనది. 2025లో దేశంలో సుమారు 2.39 లక్షల కొత్త కేసులు నమోదవుతాయని అంచనా వేశారు. ప్రతి ఏడాది అక్టోబర్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తారు. కుటుంబ బాధ్యతలు, పని ఒత్తిడి, భయం కారణంగా మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. లక్షణాలను గుర్తించి సకాలంలో వైద్యుడిని సంప్రదించడం ఎంతో ముఖ్యం.

ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

రొమ్ము క్యాన్సర్ ఉన్న ప్రతి ఒక్కరికీ నొప్పి ఉండాలని లేదు. కొత్తగా గడ్డ ఏర్పడడం, రొమ్ము పరిమాణం లేదా ఆకారం మారడం, చర్మం లోపలికి లాగినట్లు కనిపించడం, చనుమొన లోపలికి తిరగడం, అసాధారణ స్రావాలు రావడం వంటి మార్పులను గమనించాలి. ప్రతి గడ్డ క్యాన్సర్ కాకపో యినా, కొత్తగా కనిపించిన లేదా కొనసాగుతున్న మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. రొమ్ములో



సాధారణంగా ఉండే మార్పులపై అవగాహన కలిగి ఉండడంతోపాటు, వయస్సు, కుటుంబ చరిత్ర, వ్యక్తిగత ప్రమాదాలను బట్టి ఏ పరీక్షలు అవసరమో వైద్యుడిని అడగాలి. ఏదైనా లక్షణం కనిపిస్తే తదుపరి సాధారణ పరీక్ష వరకు వేచి ఉండకూడదు.

మామోగ్రఫీ అంటే..

మామోగ్రఫీ అనేది రొమ్ముకు చేసే ప్రత్యేక ఎక్స్‌రే పరీక్ష. కృత్రిమ మేధస్సు ఈ పరీక్ష చిత్రాలను విశ్లేషించి, అనుమానాస్పద ప్రాంతాలను గుర్తించడంలో వైద్యులకు సహాయపడుతుంది. స్వీడన్‌లో లక్ష మందికి పైగా మహిళలపై జరిగిన అధ్యయనంలో, సాధారణ పరీక్షలతో పోలిస్తే కృత్రిమ మేధస్సు సహకారంతో ఎక్కువ క్యాన్సర్ కేసులు గుర్తించినట్లు వెల్లడైంది. అలాగే వైద్యుల పనిభారం తగ్గినట్లు నివేదించారు. అయితే ఈ సాంకేతిక వైద్యుల నిర్ణయానికి ప్రత్యామ్నాయం కాదు. తప్పుడు హెచ్చరికలు ఇవ్వడం లేదా క్యాన్సర్‌ను గుర్తించకపోవడం కూడా జరుగుతుంది. అనుమానాస్పద ఫలితాలకు అదనపు పరీక్షలు అవసరమవుతాయి. దేశంలోనూ ఈ విధానం ఉపయోగపడాలంటే తగిన వైద్య సదుపాయాలు, నిపుణులు అందుబాటులో ఉండాలి.


ముందుగానే గుర్తిస్తే మేలు..

రొమ్ము క్యాన్సర్‌ను పూర్తిగా నివారించే మార్గం లేదు. వయస్సు, జన్యు మార్పులు, కుటుంబ చరిత్ర వంటి ప్రమాద కారకాలను మార్చలేకపోయినా, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, శారీరకంగా చురుకుగా ఉండడం, మద్యపానాన్ని పరిమితం చేయడం కొన్ని ప్రమాదాలను తగ్గిస్తుంది. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర లేకపోయినా ఈ వ్యాధి వస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించే వారికీ ప్రమాదం పూర్తిగా తొలగిపోదు. అందువల్ల మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వైద్య పరీక్షలను వాయిదా వేయకుండా, అనుమానాస్పద మార్పులు కనిపించిన వెంటనే వైద్య సలహా తీసుకోవాలి. ముందస్తు

గుర్తింపు పూర్తిస్థాయి నివారణకు హామీ ఇవ్వకపోయినా, సకాలంలో చికిత్స పొందేందుకు అవకాశాలను మెరుగు పరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# అజీర్తి సమస్య అవస్థ పెడుతోందా

## అయితే ఈ చిట్కాలు మీ కోసమే



ప్రతి ఒక్కరికీ ఏదో ఒకసారి సాధారణంగా ఎదురయ్యే కడుపుబ్బరం, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలకు వంటింట్లోనే చక్కని పరిష్కారం దొరుకుతుంది. నిత్యం వంటల్లో ఉపయోగించే జీలకర్ర మెంతులు, పసుపు యాలకులు, లవంగం అల్లం వెల్లుల్లి లాంటి వాటిని వివిధ రకాల అనారోగ్య సమస్యల పరిష్కారానికి వినియోగిస్తుంటాం. అందులో అజీర్తి సమస్యకు మెంతులు చక్కని పరిష్కారం చూపుతాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచడంలో కూడా తోడ్పడుతాయి. మెంతులను వివిధ రకాలుగా తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి అవేంటో తెలుసుకుందామా..?

మెంతులతో ప్రయోజనాలు

1. మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి. అందువల్ల మధుమేహం ఉన్నవారికి మెంతులు దివ్యమైన ఔషధంలా పనిచేస్తాయి.
2. అదేవిధంగా అజీర్తి, కడుపుబ్బరం సమస్యలను కూడా మెంతులు తగ్గిస్తాయి. రాత్రిపూట ఒక చెంచా మెంతి గింజలను నీటిలో నానబెట్టి ఉదయం లేవగానే పరిగడుపున ఆ నీళ్లను తాగాలి. దాంతో అజీర్తి సమస్య తొలగిపోతుంది.
3. మెంతుల్లో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దాంతో మనం మోతాదుకు మించిన ఆహారం తీసుకోకుండా అడ్డుకుంటుంది. ఆహారం మితంగా తీసుకోవడంవల్ల ఒంట్లో కొవ్వు కరుగుతుంది. కాబట్టి స్థూలకాయులకు కూడా మెంతులు నిత్యావసరం.
4. మెంతి గింజలను పెనం మీద వేయించి, మెత్తగా దంచి పెట్టుకోవాలి. రోజూ ఉదయాన్నే ఆ పొడిని వేడి నీటిలో కలుపుకుని తాగితే ఎన్నో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఈ పొడిని కూరల్లో కూడా వాడుకోవచ్చు.
5. ఒక చెంచా మెంతులను రోజూ ఉదయం, సాయంత్రం తీసుకోవడంవల్ల కూడా జీర్ణశక్తి మెరుగుపడుతుంది. విరేచనాలు తగ్గడానికి కూడా మెంతులు తోడ్పడుతాయి.

# చక్కెరలో ఉండే మూడు రకాలు ఏమిటి.. అవి ఏం చేస్తాయి.

చక్కెరలో సుక్రోజ్, గ్లూకోజ్, ఫ్రక్టోజ్ అనే మూడు రకాలు ఉంటాయి. బరువును బట్టి చూసినప్పుడు ఈ మూడింటి నుంచీ సమానమైన కేలరీలు లభిస్తాయి. అయితే శరీరం వీటిని జీర్ణం చేసుకునే విధానం, జీవక్రియలపై చూపే ప్రభావం భిన్నంగా ఉంటుంది. ఇవి పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, ధాన్యాల్లో సహజంగా లభిస్తాయి. అదే సమయంలో అనేక శుద్ధి చేసిన, ప్యాకెట్ ఆహార పదార్థాల్లోనూ అదనపు చక్కెరలుగా కలుపుతారు. ఆహారంలో చక్కెరను తగ్గించాలనుకునేవారు ఈ మూడు రకాల మధ్య తేడాలను తెలుసుకోవడం ముఖ్యం. ఆరు నెలలలోపు శిశువుల ఆహారంలో సుక్రోజ్, ఫ్రక్టోజ్ కలపడాన్ని నిషేధించే ప్రతిపాదనను భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ తీసుకొచ్చింది. చిన్న వయస్సులోనే అదనపు చక్కెరలకు అలవాటు పడకుండా చూడడం, తద్వారా బాల్య ఊబకాయం వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడం దీని ఉద్దేశం.

చక్కెరలోని మూడు రకాలు..

సుక్రోజ్‌ను సాధారణంగా మనం వాడే చక్కెరగా పిలుస్తారు. ఇందులో ఒక గ్లూకోజ్ అణువు, ఒక ఫ్రక్టోజ్ అణువు కలిసి ఉంటాయి. చెరకు, చక్కెర దుంపల నుంచి దీన్ని తయారు చేస్తారు. మిఠాయిలు, ఐస్‌క్రీమ్‌లు, అల్పాహార



తృణధాన్యాలు, శీతల పానీయాలు, ఇతర ప్యాకెట్ ఆహారాల్లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు. గ్లూకోజ్ ఒక సరళ చక్కెర. శరీరానికి శక్తిని అందించే ప్రధాన వనరుల్లో ఇది ఒకటి. అన్నం, చపాతీలు, కూరగాయలు వంటి కార్బొహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల ద్వారా శరీరానికి గ్లూకోజ్ లభిస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాల్లో డెక్స్ట్రోజ్ పేరుతోనూ దీన్ని కలుపుతారు. గ్లూకోజ్ చిన్న పేగుల ద్వారా నేరుగా రక్తంలోకి చేరి చక్కెర స్థాయిలను త్వరగా పెంచుతుంది. దీంతో క్లోమగ్రంథి ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, టైప్-2 మధుమేహం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది.


చక్కెర స్థాయిలపై ప్రభావం ఎలా..

ఫ్రక్టోజ్‌ను పండ్ల చక్కెరగా కూడా పిలుస్తారు. ఇది పండ్లు, తేనె, కొన్ని వేరు కూరగాయల్లో సహజంగా ఉంటుంది. ప్రాసెస్ చేసిన ఆహారాల్లో అధిక ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ రూపంలోనూ కలుపుతారు. ఈ మూడు రకాల చక్కెరల్లో ఫ్రక్టోజ్ తియ్యదనం ఎక్కువగా ఉంటుంది. గ్లూకోజ్‌తో పోలిస్తే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తక్కువగా ప్రభావితం చేసినప్పటికీ, అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా శుద్ధి చేసిన ఫ్రక్టోజ్ అధికంగా తీసుకుంటే కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం, ట్రైగ్లిజరైడ్ల స్థాయిలు పెరగడం, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అయితే పండ్లలో సహజంగా ఉండే ఫ్రక్టోజ్‌తోపాటు పీచు పదార్థాలు, ఇతర పోషకాలు కూడా లభిస్తాయి. అందువల్ల పండ్లను తినడం, అదనపు చక్కెరలు కలిపిన పానీయాలు తీసుకోవడం ఒకేలా చూడకూడదు.

సుక్రోజ్‌ను అధికంగా తీసుకుంటే..

సుక్రోజ్ శరీరంలోకి వెళ్లిన తర్వాత చిన్న పేగుల్లోని ఎంజైమ్‌ల సహాయంతో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌గా విడిపోతుంది. గ్లూకోజ్ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచగా, ఫ్రక్టోజ్‌ను ప్రధానంగా కాలేయం జీవక్రియల ద్వారా ప్రాసెస్ చేస్తుంది. సుక్రోజ్‌ను అధికంగా తీసుకోవడం వల్ల ఊబకాయం, దంతక్షయం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి చక్కెర ఏ రూపంలో ఉన్నా మోతాదును నియంత్రించడం ముఖ్యం. పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి సహజ ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదనపు చక్కెరలు కలిగిన స్వీట్లు, శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడంతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

# డేట్స్ ఆపిల్ ఖీర్



ఆపిల్ పండును చిన్నచిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి అరకప్పు నీళ్లు పోసి ఆపిల్ ముక్కలు, ఒక టీస్పూన్ చక్కెర వేసి పది నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించి పక్కనపెట్టాలి. గింజ తీసిన ఖర్జూ రాలను మిక్సీలో మెత్తగా పేస్ట్ చేసు కోవాలి. స్టవ్‌మీద మందపాటి గిన్నెపెట్టి పాలు, చక్కెర వేసి సన్నని మంటపై కలుపు తూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక ఖర్జూర పేస్ట్, యాలకుల పొడి వేసి మరికాసేపు ఉడికించాలి. చివరిగా ఉడికించిన ఆపిల్ ముక్క లు, డ్రైఫ్రూట్స్ వేసుకుంటే నోరూరించే డేట్స్ ఆపిల్ ఖీర్ సిద్ధం.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..